## క్లుప్తంగా

### కూరగాయల ధరలు



**శేరిలింగంపల్లి:** నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 120, పచ్చిమిర్చి 120, బెండ 45, కాకర 60, దొండ 50, దోస 30, ఆలు 25, చామ 45, కీర 45, బీర 50, వంకాయ 35, గోకర 50, బీన్స్ 120, బీట్‌రూట్ 50, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 30, క్యారెట్ 70, చిక్కుడు 80, ఉల్లి 100 (4 కేజీలు), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 50 సొరకాయ (కేజీ) 30, అల్లం 250, వెల్లుల్లి 160.

### అందరికీ నెగెటివ్

**పటాన్‌చెరు టౌన్:** పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం 15 మందికి కొవిడ్ ర్యాపిడ్ యాంటిజెన్ టెస్టులు నిర్వహించారు. అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. 11 మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు చేశారు.

### రోడ్డు కోసం ఎమ్మెల్యేకు వినతి

**రాయదుర్గం:** రోడ్డు నిర్మాణం కోసం తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ బృందం బుధవారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని ఆయన నివాసంలో కలిశారు. గోపన్‌పల్లి నుంచి ఉస్మాన్‌నగర్ వరకు బీటీ లేదా సీసీ రోడ్డు వేయించాలని కోరగా ఎమ్మెల్యే స్పందించి రూ.20 లక్షలు మంజూరు చేస్తానని ప్రకటించారని కాలనీవాసులు తెలిపారు. తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణీశ్వర ఆధ్వర్యంలో పలు కాలనీలవాసుల బృందం కలిశారు. ఈ ప్రాంతంలో 2వేల మంది నివాసముంటున్నారని, రోడ్డు గుంతలమయంగా మారి నిత్యం ఇక్కట్లు పడుతున్నామని వారు వివరించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ సైబర్ అర్మానియా, ముప్పా ఇంద్రప్రస్థ, సాన్సియా విల్లాస్, బొన్సాల్ ఆర్చర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

### వెస్ట్ జోనల్ కమిషనర్‌గా శ్రీనివాస్‌రెడ్డి



**గచ్చిబౌలి:** శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్‌గా బి.శ్రీనివాస్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సికింద్రాబాద్ జోనల్ కమిషనర్‌గా పని చేస్తున్న ఆయనను ఇటీవల బదిలీ చేశారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో ప్రజా సమస్యలు పరిష్కారం చేయాలని సూచించారు.

### వేమన కాలనీ ముఖద్వారం ప్రారంభం



**హఫీజ్‌పేట్ :** చందానగర్ డివిజన్ పరిధిలోని వేమన వీకర్ సెక్షన్ కాలనీ ముఖద్వారంను స్థానిక కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే గాంధీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

### కిర్బీ కార్మిక ఎన్నికల్లో సీఐటీయూ హ్యాట్రిక్

**పటాన్‌చెరు టౌన్:** కిర్బీ పరిశ్రమలో జరిగిన కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో సీఐటీయూ మూడోసారి విజయకేతనం ఎగురవేసింది. పాశమైలారం పారిశ్రామికవాడలోగల కిర్బీ పరిశ్రమలో బుధవారం జరిగిన ఎన్నికల్లో మూడు కార్మిక సంఘాలు మహాకూటమిగా ఏర్పడినా, కార్మికులు సీఐటీయూకే పట్టం గట్టారు. పరిశ్రమలో మొత్తం 604 ఓట్లకు గాను 600 ఓట్లు పోలయ్యాయి. సీఐటీయూకు 323 ఓట్లు రాగా మహాకూటమికి 277 ఓట్లు పోలవ్వగా, 46 ఓట్ల మెజారిటీతో సీఐటీయూ విజయభేరి మోగించింది. కార్మికులు స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. అనంతరం పరిశ్రమ నుంచి పటాన్‌చెరు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వరకు భారీ విజయోత్సవ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చుక్కా రాములు మాట్లాడుతూ ఇది కార్మిక విజయమన్నారు. విజయోత్సవ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, కిర్బీ, వివిధ పరిశ్రమల నాయకులు పాల్గొన్నారు.

### అనుమానాస్పద స్థితిలో ఒకరు మృతి

**రామచంద్రాపురం(పటాన్‌చెరు):** అనుమానాస్పదస్థితిలో ఒకరు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం..రామచంద్రాపురం పట్టణంలోని సంగీత థియేటర్ సమీపంలోని రోడ్డు ఎదురుగా షెడ్డు నిర్మిస్తున్నారు. అక్కడ గుర్తు తెలియని మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతి చెందిన వ్యక్తి వయస్సు 35–40 ఏళ్ల మధ్య ఉండవచ్చని పోలీసులు తెలిపారు. చనిపోయి నాలుగురోజులు కావొచ్చని, అనారోగ్యమే కారణం అయ్యి ఉండొచ్చని పోలీసులు తెలిపారు.

# నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ
- రూ.5.06 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి

**హఫీజ్‌పేట్ :** శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. బుధవారం చందానగర్ డివిజన్ పరిధిలో సుమారు రూ.5.06 కోట్లతో పలు అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. నాణ్యతతో అభివృద్ధి పనులు చేయాలన్నారు. డివిజన్ పరిధిలోని దీప్తిశ్రీనగర్ కాలనీలో రూ.73 లక్షలతో సీసీ రోడ్లు, ఇందిరానగర్ కాలనీలో రూ.3.70 కోట్లతో వరదనీటి కాలువల నిర్మాణం , వేమన వీకర్ సెక్షన్ కాలనీలో రూ.63 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, వార్డు మెంబర్లు, ఏరియా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



**బక్షికుంట చెరువు పనుల పరిశీలన**

చందానగర్ డివిజన్ పరిధిలో రాజేందర్‌రెడ్డి నగర్ కాలనీలోని బక్షికుంట చెరువు సుందరీకరణ పనులను స్థానిక కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛమైన మంచినీటి చెరువుగా తీర్చిదిద్దడమే ధ్యేయమన్నారు. ఫినామ్ పీపుల్ ఐటీ కంపెనీ, సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా బైరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెరువు సుందరీకరణ పనులు చేపట్టారన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హెచ్‌సీయూలో తైవాన్ ప్రతినిధుల బృందం



తైవాన్ బృందంతో హెచ్‌సీయూ వీసీ ప్రొ.బీజేరావు

**రాయదుర్గం:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీని తైవాన్‌లోని ఆసియా విశ్వవిద్యాలయం ప్రతినిధుల బృందం బుధవారం సందర్శించింది. తైవాన్ ఆసియా విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్లు డాక్టర్ యింగ్‌హలాయ్‌చెన్, డాక్టర్ జియున్ జోంగ్‌వు, డాక్టర్ చున్-వీ రెమెన్‌లిన్, డాక్టర్ రాబర్ట్ హ్సు, డాక్టర్ చార్లెస్ సిఎన్‌వాంగ్ బృందం ఉన్నారు. హెచ్‌సీయూ వీసీ ప్రొ.బీజేరావు, ఇతర ప్రొఫెసర్లు, డీన్లు పలు అంశాలపై చర్చించారు. ఆసియా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్, మెడికల్ సైన్సెస్ రంగాలలో బలంగా ఉంది. ఇండో- తైవాన్ కార్యక్రమాలలో భాగంగా రెండు విశ్వవిద్యాలయాలు తాము సహకరించగలిగే అంశాలను అన్వేషించాలని నిర్ణయించారు. ప్రాజెక్టుల కోసం దరఖాస్తు చేసుకోవాలని నిర్ణయించుకున్నాయి. అంతకుముందు వీసీ ప్రొఫెసర్ బీజేరావు ఈ ప్రతినిధిబృందాన్ని సత్కరించారు. ఓఐఏ డైరెక్టర్ ప్రొఫెసర్ చేతన్ శ్రీవాస్తవ, అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ అలోక్‌మిశ్రా పాల్గొన్నారు.

## విద్యార్థులకు బస్ పాస్‌ల పంపిణీ



విద్యార్థులకు బస్ పాస్‌లు పంపిణీ చేసిన బండి రమేష్

**మియాపూర్ :** మియాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం బండి రమేష్ సేవా సంస్థ సౌజన్యంతో బస్ పాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి రమేష్ ఆర్టీసీ డిపో మేనేజర్ శంకర్‌రావుతో కలిసి పాసులను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో తాగునీటి సమస్య, టాయిలెట్స్, అదనపు తరగతి గదుల సమస్యల గురించి ఆయనకు ఉపాధ్యాయులు వివరించారు. రమేష్ మాట్లాడుతూ అదనపు తరగతి గదుల విషయమై విద్యాశాఖ దృష్టికి తీసుకువెళతానన్నారు. టాయిలెట్స్ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వసుంధర, బీఆర్‌ఎస్ నాయకులు నర్సింగ్‌రావు, సంగారెడ్డి, బాలరాజ్, శేఖర్‌గౌడ్, అరుణ, మనీష్, సత్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమాజంలో విద్య,వైద్య రంగాలు కీలకం




విద్యార్థినులను సన్మానించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

**పటాన్‌చెరు టౌన్:** విద్యావ్యవస్థను అగ్రభాగాన నిలపాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. విద్యారంగంలో పటాన్‌చెరు నియోజకవర్గం మంచి ఫలితాలు సాధిస్తోందన్నారు. ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన 960 మంది ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులను బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో విద్య, వైద్యం ఎంతో ప్రాధాన్యత కలిగిన అంశాలన్నారు. ఇందుకు అనుగుణంగా సీఎం కేసీఆర్ రాష్ట్రం ఏర్పడిన అనంతరం విద్య, వైద్యరంగం బలోపేతానికి వేల కోట్ల ఖర్చు చేస్తున్నారని తెలిపారు. వెయ్యికి పైగా గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, డీఎస్పీ భీంరెడ్డి, ఎంపీపీలు ప్రవీణ, సుష్మాశ్రీ, జెడ్పీటీసీలు సుధాకర్ రెడ్డి, సుప్రజా వెంకట్ రెడ్డి, కుమార్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, కార్పొరేటర్లు మెట్టు కుమార్, యాదవ్ పుష్ప నగేష్, మున్సిపల్ చైర్మన్లు రోజా బాల్‌రెడ్డి, లలితా సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### బీబీఏ కోర్సు ప్రారంభం

**పటాన్‌చెరు టౌన్:** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి కళాశాల విద్యాశాఖ కమిషనర్ నూతనంగా బీబీఏ కోర్సు మంజూరు చేసినట్లు ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులో చేరాలనుకునే విద్యార్థులు ఆన్‌లైన్ దోస్త్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని అడ్మిషన్ పొందవచ్చని సూచించారు. డిగ్రీలో అడ్మిషన్ పొందడానికి మూడో విడతలో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకునే విద్యార్థులు బీబీఏ కోర్సుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల పటాన్‌చెరును ఎంపిక చేసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### హెచ్‌సీయూ పరిశోధక విద్యార్థినికి అరుదైన పురస్కారం



స్నేహబెనర్జీ

**రాయదుర్గం:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిశోధక విద్యార్థిని స్నేహ బెనర్జీ పీహెచ్‌డీ కేటగిరీలో అరుదైన 'అగ్యుమెంటింగ్ రైటింగ్ స్కిల్స్ ఫర్ ఆర్టికులేటింగ్ రీసెర్చ్(ఏడబ్ల్యూఎస్ఏఆర్) అవార్డు–2022' దక్కింది. స్నేహ ప్రస్తుతం హెచ్‌సీయూలో పీహెచ్‌డీ రీసెర్చ్ స్కాలర్‌గా కొనసాగుతున్నారు. ఉత్తమ పాపులర్ సైన్స్ స్టోరీస్ కోసం ఆమె రాసిన 'ఎస్ఓ, ఎంఆర్ కేన్సర్–2050లో మిమ్మల్ని మీరు ఎక్కడ చూస్తారు?' వ్యాసానికి ఈ పురస్కారం దక్కింది. ఈ పోటీకి సమర్పించిన 7 వేల ఎంట్రీలలో టాప్–100లో స్నేహకు స్థానం లభించడం విశేషం. భారత ప్రభుత్వంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ నుంచి ప్రశంసా పత్రంతోపాటు రూ.10 వేల నగదు అందిస్తారు.

### సమస్యలు పరిష్కరిస్తాం

**రామచంద్రాపురం(పటాన్‌చెరు) :** డివిజన్ పరిధిలోని కాలనీలలో పూర్తిస్థాయిలో రోడ్ల సమస్యలు పరిష్కరిస్తామని కార్పొరేటర్ పుష్పనగేష్ తెలిపారు. బుధవారం కాకతీయనగర్‌లో నూతనంగా సీసీ రోడ్లు వేయనున్న ప్రాంతాలను అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాకతీయనగర్ కాలనీ సీసీ రోడ్ల అభివృద్ధి కోసం రూ.80లక్షలు మంజూరయ్యాయన్నారు.

### ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతా

కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

**భాగ్యనగర్‌కాలనీ:** హైదర్‌నగర్ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దుతానని హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం ఆయన డివిజన్ పరిధిలోని నందమూరి నగర్‌లో చేపడుతున్న వరదనీటి కాల్వ నిర్మాణ పనులను జీహెచ్‌యంసీ ఇంజనీరింగ్, జలమండలి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ రాజీవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, జలమండలి అధికారులు మేనేజర్ ప్రశాంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహమూద్, లైన్‌మెన్ సునీల్, సూపర్‌వైజర్ నరేందర్, నాయకులు పోతుల రాజేందర్, వెంకట్రావు, నాగవరప్రసాద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



### కొత్త పైపులైన్లు వేయండి



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సబిహా బేగం

**మోతీనగర్:** అల్లాపూర్ డివిజన్‌లోని పర్వత్‌నగర్, గాయత్రినగర్, శ్రీ వివేకానందనగర్, అల్లాపూర్‌లలో దెబ్బతిని శిథిలావస్థకు చేరుకున్న పాత పైపులైన్‌లను స్థానిక కార్పొరేటర్ సబిహా బేగం జలమండలి డీజీఎం రవికుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మూర్తిలతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూగర్భ డ్రైనేజీ లైన్లు శిథిలావస్థకు చేరుకుని సమస్య ఉత్పన్నమవుతున్న చోట నూతన పైపులైన్‌లు వేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి పిల్లి తిరుపతి, జాహెద్ షరీఫ్ బాబా, సంజీవరెడ్డి, రోణంకి జగన్నాథం, నసీర్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన డీసీఎం

వ్యక్తి మృతి



శ్రీనివాస్ (ఫైల్)

**మియాపూర్:** స్కూటీపై వెళ్తున్న వ్యక్తిని వెనుక నుంచి డీసీఎం ఢీకొనడంతో కిందపడి మృతిచెందిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పంపాన శ్రీనివాస్(46), భార్య శాంతి, కుమారుడు రాకేష్, కుమార్తె మాళవికలతో కూకట్‌పల్లిలోని ఎల్ఐజీ థర్డ్ ఫేజ్‌లో నివాసముంటున్నాడు. శ్రీనివాస్, కూకట్‌పల్లి ఆర్టీసీ కాలనీలో ఉన్న గ్రీన్ ఫారెస్ట్ నేచురల్ ప్రొడక్ట్ సంస్థలో సరుకుల డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం శ్రీనివాస్ చందానగర్‌లో డెలివరీకి స్కూటీపై వెళ్తుండగా మియాపూర్‌లోని సితార గ్రాండ్ హోటల్ ముందుకు రాగానే మియాపూర్ నుండి చందానగర్‌వైపు వెళ్తున్న డీసీఎం వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో శ్రీనివాస్ కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఉద్భవ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న మియాపూర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని శ్రీనివాస్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. భార్య శాంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## రాష్ట్రాన్ని అప్పుల పాల్జేసిన బీఆర్‌ఎస్

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్

**పటాన్‌చెరు టౌన్:** రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్ విమర్శించారు. బుధవారం పార్టీ పట్టణ శ్రేణులతో కలిసి శ్రీకాంత్‌గౌడ్ తెలంగాణ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను హైదరాబాద్ శామీర్‌పేట్‌లోని ఆయన నివాసం వద్ద కలిసి సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యుడు దేవేందర్ గౌడ్, భారతీనగర్ డివిజన్ అధ్యక్షుడు మన్నే శ్రీకాంత్, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, జిన్నారం మండల అధ్యక్షుడు బండి శ్రీకాంత్ గౌడ్, బీజేవైఎం పటాన్‌చెరు అసెంబ్లీ కన్వీనర్ రాజ్‌గోపాల్ యాదవ్, పోచారం బీజేవైఎం నాయకులు సందీప్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు జోగు ధన్ రాజ్, సోషల్ మీడియా కన్వీనర్ సంగమేష్ తదితరులు పాల్గొన్నారు.

**మర్యాదపూర్వకంగా...**

**రామచంద్రాపురం(పటాన్‌చెరు) :** బీజేపీ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన ఈటల రాజేందర్‌ను నాయకులు అంంజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక నేతలు కలిసి సన్మానించారు. ఈటల రాజేందర్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు.

## పేద, మధ్య తరగతి వర్గాలకు యాజమాన్య హక్కులు



లబ్ధిదారులకు పట్టాలు అందజేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

**ఆల్విన్‌కాలనీ:** జీఓ 58, 59లో భాగంగా పాపిరెడ్డినగర్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి యాజమాన్య హక్కుల పట్టాలను బుధవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్‌లు జూపల్లి సత్యనారాయణ, దొడ్ల వెంకటేష్‌గౌడ్‌లతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ దశాబ్దాలుగా నివాసం ఉంటున్న నిరుపేదలకు జీఓ నంబర్ 58 ప్రకారం రెగ్యులరైజ్ చేసి భరోసా కల్పించిన మహానుభావుడు కేసీఆర్ అని కొనియాడారు. ఈ అవకాశాన్ని వినియోగించుకున్న పేద, మధ్య తరగతి ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు చిట్టిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, గడ్డం రాజేశ్వరరెడ్డి, భగవంతరెడ్డి, ఈరెడ్డి దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఏడీపీ ఇండియా కమ్యూనిటీ డెవలప్‌మెంట్ డ్రైవ్

**రాయదుర్గం:** ప్రముఖ సాఫ్ట్‌వేర్, సర్వీసెస్ సంస్థ ఏడీపీ ఇండియా నెలరోజుల కమ్యూనిటీ డెవలప్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తోంది. అందులో భాగంగా మంత్ ఆఫ్ కేరింగ్‌లో నిత్యావసరాల పంపిణీతో పాటు రక్తదాన శిబిరాలు, మహిళలు, పిల్లల సాధికారత సెషన్లు, ఆర్టిజన్ అండ్ క్రాఫ్ట్ ప్రమోషన్లను నిర్వహించినట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనాధ పిల్లలకు దుస్తులు, స్కూల్ కిట్లను పంపిణీ చేశారు. ఏడీపీ మేనేజింగ్ డైరెక్టర్ విజయ్ వేములపల్లి మాట్లాడుతూ బాధ్యతగల కార్పొరేట్‌గా కమ్యూనిటీ అభివృద్ధి, సామాజిక సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తూనే ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సంస్థ ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.




నానక్‌రాంగూడలో పేదలకు సరుకులు అందజేసిన సంస్థ ప్రతినిధులు

# 'సీనియర్' స్విమ్మర్

60వ ఏట ఈత నేర్చుకొని.. పతకాలు సాధిస్తూ..



స్విమ్మింగ్ పోటీల్లో సాధించిన మెడల్స్‌తో విశ్వనాథ గుప్త



జీవై ఫౌండేషన్, అపర్ణ సైబర్ లైఫ్ అసోసియేషన్‌లు సన్మానిస్తున్న దృశ్యం (ఫైల్)

**శేరిలింగంపల్లి :** అరవై ఏళ్ల వయసులో స్విమ్మింగ్ నేర్చుకున్నాడు..పట్టుదలతో ప్రయత్నించి పతకాలు సాధిస్తూనే ఉన్నాడు. కృషి, చిత్తశుద్ధి ఉంటే సాధించలేనిది ఏదీ ఉండదని నిరూపిస్తున్నాడో సీనియర్ సిటిజన్. ఏపీలోని శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు టంకల విశ్వనాథ గుప్త శేరిలింగంపల్లి నల్లగండ్లలోని ఓ అపార్ట్‌మెంట్‌కు మకాం మార్చాడు. స్వతహాగానే వాలీబాల్ ఆడే విశ్వనాథగుప్త డాక్టర్ సలహాతో స్విమ్మింగ్‌పై దృష్టి పెట్టాడు. ప్రగతినగర్‌లోని స్విమ్మింగ్‌పూల్‌లో శిక్షణ పొందాడు. స్విమ్మింగ్‌లో సీనియర్ సిటిజన్ పోటీలలో కూడా పాల్గొనడం ఆరంభించాడు. అనేక పోటీల్లో పతకాలు కైవసం చేసుకొని అబ్బురపరుస్తున్నారు. తాను నేర్చుకోవడమే కాదు పిల్లలకు కూడా స్విమ్మింగ్‌లో శిక్షణఇచ్చే స్థాయికి ఎదిగాడు.

**సీనియర్ సిటిజన్ కేటగిరీలో విశ్వనాథగుప్త సాధించిన పతకాలు**

- 2016లో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లో నిర్వహించిన రంగారెడ్డి జిల్లాస్థాయి పోటీల్లో బ్రాంజ్ మెడల్ సాధించారు.
- 2021లో సికింద్రాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ కైవసం చేసుకున్నాడు.
- 2022లో తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 7వ తెలంగాణ మాస్టర్స్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో 2 గోల్డ్, 2 సిల్వర్, 1 బ్రాంజ్ మెడల్ సాధించారు.
- 2023లో గచ్చిబౌలిలో నిర్వహించిన ఐదవ ఆల్ ఇండియా మాస్టర్ గేమ్స్ చాంపియన్ షిప్ పోటీల్లో 1 గోల్డ్ మెడల్, 2 సిల్వర్ మెడల్స్ సాధించారు.

**నిత్యం ఐదు గంటలు స్విమ్మింగ్ చేస్తా**

నిత్యం తప్పనిసరిగా ఉదయం మూడు గంటలు.. సాయంత్రం రెండు గంటలు స్విమ్మింగ్ చేస్తాను. నాకు ఇది రెగ్యులర్ ప్రాక్టీస్‌లా మారింది. చిన్నారులకు కూడా శిక్షణ ఇస్తున్నా.

–టంకల విశ్వనాథగుప్త, సీనియర్ సిటిజన్, నల్లగండ్ల అపర్ణ సైబర్ లైఫ్